# బొట్లేరింగిలీషు కాదు

"నూరేళ్ళ నుంచీ ఒక్కటే నాటకం; నలభై ఏళ్ళనుంచీ ఒక్కడే హీరో. ఇదీ మన నాటక రంగానికీ సినీ రంగానికీ పట్టుకున్న దుర్గతి" అన్నారు 'భావ'గారు; ఉక్రోషంగా, చిరాగ్గా; మొహం అసహ్యంగా పెట్టి. ఆ చిరాకుతోనే తనకి మంచిముక్కలు పడలేదన్న చిరాకును కలిపి డ్రాప్ చేసేస్తూ

'భావగారు' అంటాము. క్లుప్తంగా- పూర్తిపేరు భావనారాయణ స్వామిగారు. వాళ్ళావిడను మొదట్లో మిత్రులందరం ప్రహ్లాదుళ్ళాగా అన్యకాంతకదా అని మాతృభావము చేసి మరలినా, ఆవిడ అందర్నీ తమ్ముడూ అని తప్ప మరోలా పిలవక పోడంచేత ఆవిడ అక్కగారయి పోయి తద్వారా ఆయన బావగారయ్యారు. ఒత్తుపెడితే ఉభయతారకంగా వుంటుందని ఏ రేడియో కార్యక్రమం విని ఎవరు మొదలెట్టారోగాని ఆ తరవాత క్రమంగా అందరం క్రమం తప్పకుండా ఆయన్ని భావగారూ అనడం ప్రారంభించాం. అది వేరే కథ! రామప్పంతులన్నట్టు.

"నాటకం సరే; హీరో ఒక్కడే నంటారా?" అన్నాను, కన్యాశుల్కాన్ని ఒప్పేసుకొంటూ.

"ఆహా, ఒక్కడే."

"రాత్రి రేడియోలో మాట్లాడి నాయనేనా?"

"ఆయన హీరో కాదు; నీరో."

"నీరో యెవరండోయ్!" అని ప్రసాదరావు తనుకూడా డ్రాప్ అయ్యేడు. ఇంక మిగిలింది రమణారావూ నేనే.

"నీరో తెలీదూ? రోమ్ చక్రవర్తి దేశం తగలడి పోతూవుంటే ఫిడేలు వాయిస్తూ చూస్తూ నిలబడ్డాడు!"

"దేశం అంటే ఏదో రాజకీయపార్టీ అనుకొంటున్నావు కాబోలు. దేశమంటే మట్టికాదు, దేశమంటే మనుషులు!" అన్నారు భావగారు.

"మండు భగ్గున రోము పురమూ,
మండు భగ్గున రాజధానీ,
మంట చూచిన నాదు తనువు—
ప్పొంగి పొయెడివి!" అని గానం కూడా చేసేరు.

"మీకు విజయనగరం మీదా గురజాడ అప్పారావుగారి మీదా ఎంత అభిమానం అయినా, నూరేళ్ళ నుంచీ అదొక్కటే నాటకం అంటే మాత్రం వొప్పుకోలేం భావగారూ" అన్నాడు రమణారావు.

"నే చెబుతాను!" అన్నాడు ప్రసాదరావు. కిందని ఆ పాటికే గుట్టలాగా పడుతున్న పేకముక్కల్ని దొంతరగా పెట్టి, డ్రాప్ కార్డులు చేర్చి మళ్ళా కలిపాడు. కట్ జోకర్‌ని విడిగాపెట్టి, కలిపి, కోతకోసి నేనూ రమణారావూ సదుపాయంగా ఏరుకోడానికి వీలుగా ఏటవాలుగా పరిచాడు. "భావగారికి కన్యాశుల్కంలో అన్నిటికన్నా నచ్చింది గిరీశంగారి ఇంగ్లీషనుకొంటాను."

"ఆ బొట్లేరు ముక్కల్లో అంతగా నచ్చడానికి ఏమిటుంది?" అన్నాడు రమణారావు కసిగా.

భావగారు చాపమీద చరిచారు. "అవి బొట్లేరు ముక్కలని కొట్టి పారేడానికి నీ కొచ్చిన ఇంగ్లీషేపాటిది రవణా?" అన్నారు.

నాకు 'షో' అయింది. ఆ వోటమీ ఈ వోటమీ కలిసి రమణారావు కసిని పెంచి భావగారిమీద యుద్ధానికి సిద్ధం చేసినట్టుంది. పైగా అతను ఇంగ్లీషు మేష్టరు కదా! "నాకెంతో ఇంగ్లీషు రాకపోయినా గిరీశంగారి ఇంగ్లీషు బట్లరింగ్లీషనడానికి సరిపోయినంత వొచ్చులెండి" అన్నాడు కౌంట్ చేసి, డబ్బులు లెక్కెట్టి నావేపు నెమ్మదిగా విసిరేస్తూ.

"లెట్ మి బిగిన్ ది కాంపైన్ ఎట్ వన్స్" అన్నారు భావగారు. "నెవ్వర్ దూ బై హావ్స్" అన్నాడు గిరీశం. ఇప్పుడు నేనేం చెప్పినా సరే; త్రోయింగ్ పెర్ల్స్ బిఫోర్ స్వైన్ అవుతుందని నాకు తెలుసు. అయినా నాతో మాట్లాడ్డమే ఓ ఎడ్యుకేషన్ అన్నాడు కదా గిరీశం.... ఆపు, ఈ ఆట పంచకు. ముందు ఇదేదో తేలనీ! అవును. వన్ థింగ్ ఎట్ ఎ టైమ్ అన్లేదూ, గిరీశం? ఇప్పుడు గిరీశంది మంచి ఇంగ్లీషే అని తేలడం, ఇంగ్లీషు మేస్టరుగా వృత్తిలో వున్న ఈ రవణకి ఇంగ్లీషు రాదని నిర్ధారణ అవడం. టూ బర్డ్స్ ఎట్ వన్ షాట్! అంచేత-

"అదికాదు భావగారూ, ఆడుకుంటూ చెప్పొచ్చుగా" అన్నాను.

"నువ్వేమో గెలుస్తున్నావు. మేక్ హే వైల్‌దిసన్ షైన్స్ అన్న ధోరణిలో వున్నావు. అంచేత నన్ను మాట్లాడొద్దంటున్నావు.

దిసీజ్ బార్బరస్" అన్నారు భావగారు.

"అదుగో, అక్కగారు టీ తెచ్చేరు" అన్నాడు ప్రసాదరావు.

భావగారు అటు చూసి "హా బ్యూటీఫుల్! క్వైట్ అనెక్స్పెక్టెడ్!" అన్నారు.

"పోదురూ! మీరు మరీని...." అన్నారు అక్కగారు సిగ్గుపడ్డానికి గట్టిగా ప్రయత్నిస్తూ. భావగారి ఆవేశ సందర్భాన్ని గ్రహించక అదేదో అభావ చేష్టగా తీసుకుని.

అందరికన్నా ముందుగా టీ అందుకున్నారు భావగారు. నాతో ప్రత్యేకంగా "నువ్వేమన్నా అనుకోగానీ, ఓల్డ్ ఈజ్ గోల్డ్. అయామ్ డ్రెడ్ఫుల్లీ ఇన్ లవ్ విత్ హర్" అన్నారు.

"నీకు టీ వద్దా తమ్ముడూ?" అన్నారు అక్కగారు రమణారావుతో.

"నాట్ ది స్లయిటెస్ట్ అబ్జక్షన్. అనగా ఎంత మాత్రము అభ్యంతరం లేదు" అని నేనే చెప్పి, రమణారావుకి టీ అందించాను.

"వెల్! మైడియర్ ఎంప్రెస్-రమణ ఏదో మూడ్లో వున్నాడు. మై హార్ట్ మెల్ట్స్ సచ్ ఎ మాన్ ఈజ్ టు బి పిటీడ్ .... ఆ పళ్ళెం అక్కడ పెట్టేసి రనెవే మై డార్లింగ్! పోయి పెరట్లో నేచర్ స్టడీ చేసుకో" అన్నారు భావగారు.

"ఇంకా కాసేపు యిలా సాగితే భావగారు నాటకం అంతా అప్పచెప్పేస్తారు" అని రమణారావు చెవిలో గొణిగాను.

"ఐ బెగ్ యువర్ పార్డన్ భావగారు" అన్నాడు రమణారావు. వెంటనే, "ఐ క్రేవ్ యువర్ మెర్సీ ఒప్పుకుంటున్నాను. ఐ టర్న్డ్ ఆల్ టు గెదర్ ఎ న్యూలీఫ్."

"ఎంతసేపైంది, చీకట్లోంచి వెలుగులో కొచ్చి?" అని దబాయించేరు భావగారు.

"ట్వెంటీఫోర్ పెంటెన్స్ ట్వంటీఫోర్ సెకండ్స్ చాలదాండీ?" అన్నాను, పేకముక్కలు చక చకా పంచేస్తూ.

"దటీజ్ రైట్. ఒపీనియన్స్ అప్పుడప్పుడు ఛేంజి చేస్తూంటూనే గాని పొలిటీషియన్ కానేరడు." అన్నారు భావగారు.

(13-2-84)